క్లుప్తంగా

నేడు విగ్రహావిష్కరణ

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామంలో సోమవారం మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు ఉపేందర్ తెలిపారు. ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్, పార్టీ పదాధికారులు, సీనియర్ నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. రాథోడ్ అభిమానులు, బీజేపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

నూతన కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీనగర్ కాలనీ పశ్చిమ భాగం నూతన కార్యవర్గాన్ని ఆదివారం సంఘ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో గౌరవ అధ్యక్షుడిగా కదం నారాయణరావు, అధ్యక్షుడిగా తీగల భీమన్న, ఉపాధ్యక్షుడిగా అన్నం సాయన్న, కార్యదర్శిగా ఇంగుల శంకర్‌రావు, సహాయ కార్యదర్శిగా పెంటు ప్రసాద్, కోశాధికారిగా లక్కడి అజయ్‌కుమార్, సలహాదారులుగా సల్ల శ్రీనివాస్, నరసింహులు, నర్సయ్య ఎన్నికయ్యారు. ఈసందర్భంగా సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో ఉపాధ్యాయుడిగా పనిచేసే పోతుగంటి గంగాధర్ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు స్వీకరించారు. ఆదివారం మండలంలోని పాట్టపెల్లిలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు గంగాధర్‌కు మెమెంటో అందించి శాలువాతో సన్మానించారు. ఇందులో సభ్యులు శ్రీనివాస్, చిన్నారెడ్డి, నరేశ్, విజయ్, మహేశ్, చించోలి భూమేశ్, సురేశ్, సాయన్న, వంశీకృష్ణ, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ


బ్యాగులు ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు

మామడ: మండలంలోని గోండుగూడలో గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు రూ.ఐదు వేల విలువైన బ్యాగులు, టపాసులు పంపిణీ చేశారు. ఆదివాసీలు మత్తు పదార్థాలకు దూరం ఉండాలని ఫౌండేషన్ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంతోష్, రమేశ్, రాజేశ్వర్, అంగన్‌వాడీ టీచర్ సీత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు

ముధోల్ : మండలంలోని బ్రిదెల్లి పీఏసీఎస్‌లో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ టి.వెంకటేశ్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఏపీ, 12:32:16 అందుబాటులో ఉందని.. కావాల్సిన రైతులు ఆధార్, పట్టాపాస్‌బుక్, జిరాక్స్‌లతో సంఘం గోదాంలో సంప్రదించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన గాండ్ల శ్రీనివాస్, శ్రీధర్‌కు మాతృవియోగం కావడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బీసీ రాజన్న, పానగంటి రాజేందర్, కొక్కుల ప్రదీప్, గౌరీకార్ రాజు, పాల సంతోష్, శ్రావణ్, రాకేశ్, చంద్రహాస్ తదితరులు ఉన్నారు.

పేకాట స్థావరంపై దాడి

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామంలో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై గణేశ్, తన సిబ్బందితో కలిసి దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.12,860 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మలుపు సరిచేయరూ..


పీచర నుంచి రాచాపూర్ వెళ్లే మార్గంలో..

లక్ష్మణచాంద: మండలంలోని పీచర నుంచి రాచాపూర్, సోన్ వెళ్లే మార్గంలో పిచ్చిమొక్కలు పెరిగి రోడ్లపైకి వస్తున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద పిచ్చి మొక్కలు తొలగించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


పీచర నుంచి సోన్ వెళ్లే మార్గంలో..

ప్రమాదకరంగా స్తంభం



కుభీర్: మండలంలోని బెల్గాం గ్రామంలో వాగు ఒడ్డున విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ఇటీవలి వర్షాలకు స్తంభం కింద మట్టి కొట్టుకుపోయింది. ఈదురు గాలులకు పడేలా ఉందని.. విద్యుత్ అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

3 కిలోమీటర్లు.. 12 మలుపులు





కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్, విఠాపూర్, పాతవెంకూర్ గ్రామాల మీదుగా కొత్తవెంకూర్ వరకు పది కిలోమీటర్ల మేర రూ.3 కోట్లతో తారురోడ్డు నిర్మించారు. కానీ అందకూర్ నుంచి పెంచికల్‌పాడ్ మార్గంలో 3 కిలోమీటర్ల మేర 12 మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు మూలమలుపులను సరిచేసి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

భైంసాలో హైవే కష్టాలు

- అధ్వానంగా భైంసా–నిర్మల్ జాతీయ రహదారి
- పట్టణంలో ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- అస్తవ్యస్త నిర్వహణతో వాహనదారులకు ఇబ్బంది


హైవేపై గుంతలు, నిలిచిన నీరు

భైంసాటౌన్: అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో పట్టణంలో భైంసా–నిర్మల్ జాతీయ రహదారి నిర్వహణ అధ్వానంగా మారింది. జిల్లాలో తానూరు మండలం బెల్‌తరోడా నుంచి నిర్మల్ జిల్లాకేంద్రంలోని మంచిర్యాల చౌరస్తా వరకు 61వ జాతీయ రహదారి విస్తరించి ఉంది. భైంసా పట్టణంలో భోకర్ చౌరస్తా నుంచి పార్డి(బి) బైపాస్ రోడ్ కూడలి వరకు ఉంది. పట్టణంలో పలుచోట్ల రోడ్డుపై గుంతలు పడ్డాయి. మధ్యలో డివైడర్‌పై మున్సిపల్ ఆధ్వర్యంలో పెంచే మొక్కలకు డ్రిప్ ద్వారా నీరందిస్తున్నారు. అయితే మొక్కలకు అందిస్తున్న నీరు ఎక్కువ రోడ్డుపైకి చేరుతుండటంతో వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడుతున్నాయి. నిర్మల్ చౌరస్తా, ఫైర్‌స్టేషన్, పిప్రి కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయి. మొక్కలకు అందించే నీరు గుంతల్లో నిలిచి రోడ్డు మరింత దెబ్బతింటోంది.

యూటర్న్‌ల వద్ద మొక్కలు..

పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా జాతీయ రహదారిపై ఇష్టారీతిన యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. దీంతోపాటు డివైడర్ మధ్యలో పెరిగిన మొక్కలతో యూటర్న్‌ల వద్ద అవతలి వైపు వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. యూటర్న్‌ల వద్ద రోడ్డుపై గుంతలు సక్రమంగా పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా బస్‌డిపో, నిర్మల్ చౌరస్తా, ఖడ్డా హోటల్, ఎంపీడీఓ కార్యాలయం వెళ్లే మార్గంలో యూటర్న్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. యూటర్న్‌ల వద్ద వంద మీటర్ల వరకు డివైడర్‌పై మొక్కలు ఉండకూడదు. కానీ పట్టణంలో యూటర్న్‌ల వద్ద మొక్కలు విరివిగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

నామమాత్రంగా మరమ్మతులు..

హైవేపై తరచుగా నామమాత్రంగా మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో రోడ్డుపై గుంతలు పూడ్చిన కొద్దిరోజులకే మళ్లీ గుంతలు తేలుతున్నాయి. యూటర్న్‌ల వద్ద సైతం గుంతలు పూడ్చినా.. నాసిరకం పనులతో మళ్లీ యథాస్థితి నెలకొంటోంది. ఇటీవల ఎంపీడీఓ కార్యాలయం వెళ్లే మార్గంలో యూటర్న్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఇక్కడ యూటర్న్ వద్ద డివైడర్‌పై వంద మీటర్ల మేర మొక్కలు తొలగించారు. దీంతో కొద్దిమేర ఇబ్బంది తొలగినట్లయింది. కానీ యూటర్న్‌ల వద్ద గుంతలతో ఇబ్బంది ఏర్పడుతోంది. మరమ్మతులు చేపట్టి.. హైవేపై ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

హైవే నిర్వహణ మా పరిధిలోకి రాదు. పట్టణంలో హైవే వెంట డివైడర్‌పై మొక్కలకు రోజు నీరందిస్తున్నాం. కొన్నిచోట్ల పైప్‌లైన్‌కు లీకేజీలతో హైవే పైకి నీరు చేరి గుంతలు పడుతున్నాయి. లీకేజీలు లేకుండా చర్యలు తీసుకుంటాం. యూటర్న్‌ల వద్ద డివైడర్‌పై పెరిగిన మొక్కలు తొలగిస్తున్నాం.

– బి.రాజేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, భైంసా


ఖడ్డా హోటల్ సమీపంలో డివైడర్ వద్ద గుంత


ఫైర్‌స్టేషన్ సమీపంలో యూటర్న్ వద్ద మొక్కలు


రోడ్డుపైకి వస్తున్న నీటితో ఏర్పడిన గుంత

దీపావళి సందడి


భైంసాలో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళ


తానూరులో టపాసుల దుకాణం వద్ద..

భైంసారూరల్/తానూరు: దీపావళి పండుగ నేపథ్యంలో పలు దుకాణాల వద్ద సందడి నెలకొంది. సోమవారం మహాలక్ష్మీ పూజ, మంగళవారం కావడంతో ఆదివారం తానూరులోని పూజసామగ్రి, పూలు, టపాసులు విక్రయించే దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి. బంతిపూలు, మట్టి ప్రమిదలు, టపాసులు అమ్మే దుకాణాల వద్ద బారులుతీరారు.

తాగి వాహనాలు నడిపితే చర్యలు


తానూరు: తనిఖీ చేస్తున్న ఎస్సై హన్మాండ్లు


ఖానాపూర్‌లో వివరాలు అడుగుతున్న పోలీసులు

తానూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హన్మాండ్లు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని హిప్నెల్లి గ్రామ సమీపంలోని తానూరు–భైంసా రోడ్డుపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వాహనదారులు తమ వెంట వాహనాల ధ్రువపత్రాలు ఉంచుకోవాలని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మైనర్లకు అవగాహన కల్పించారు. పత్రాలు సరిగా లేని 10 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

సారంగాపూర్: మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానరోడ్లపై తనిఖీలు నిర్వహించగా బైక్‌లను నడుపుతున్న ఐదుగురు మైనర్లను గుర్తించారు. వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మైనర్లకు వాహనాలు ఇచ్చి వారిని నడపమని ప్రోత్సహించడం నేరమని ఎస్సై గణేశ్ అన్నారు. ఆదివారం నర్సాపూర్ (జి) మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇద్దరు మైనర్లు బైక్ నడుపుతూ పట్టుబడగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానాలు విధించినట్లు ఆయన వెల్లడించారు.

ఉత్సవాలకు రావాలని ఆహ్వానం


ఆహ్వానం అందిస్తున్న కమిటీ సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఆరో తేదీవరకు నిర్వహించనున్నారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్‌నాయక్‌ను కలిసి బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానించారు. పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని శ్రీ గోదా శ్రీకృష్ణ మందిరం ప్రతిష్ఠ మహాకుంభ సంప్రోక్షణను ఈనెల 23 నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు శ్రీగోదా గోష్టి నిర్వాహకులు వెంకటరమణ తెలిపారు. త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో జరిగే ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అడ్డగట్ల రాజన్న, కమిటీ సభ్యులు లింగాల రాము, లక్ష్మణ్, నడిమట్ల రమేశ్, ఎల్లప్ప, నాయకులు సురేశ్, రాజు, రాజగంగన్న, ప్రదీప్, వాల్‌సింగ్, వసంత్, శ్రావణ్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నమ్మండి ఇది రోడ్డే..

- అధ్వానంగా మొగ్గి రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


కోలూరు నుంచి మొగ్గి వెళ్లే మార్గంలో కంకర తేలి అధ్వానంగా రోడ్డు

తానూరు: మండలంలోని కోలూరు నుంచి మొగ్గి గ్రామం వరకు వెళ్లే ఐదు కిలోమీటర్ల బీటీ రోడ్డు కంకరతేలి గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు సాగించేందుకు ప్రజలు జంకుతున్నారు. తరచుగా ఈమార్గంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుంటారు. మహారాష్ట్రకు సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో రోడ్డు సమస్య విన్నవించినా అధికారులు, పాలకులు దృష్టిసారించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.


మొగ్గిలో తారు లేచి ఇలా..

వైద్యవిద్యార్థులకు సన్మానం


సన్మానిస్తున్న డాక్టర్ దామెర రాములు

నిర్మల్‌టౌన్: నీట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రభుత్వ వైద్యకళాశాలలో సీట్లు పొందిన ఇద్దరిని జిల్లాకేంద్రంలోని నిర్మల్ నర్సింగ్ హోమ్‌లో ఆదివారం సన్మానించారు. సారంగాపూర్ మండలం మలక్‌చించోలి గ్రామానికి చెందిన శ్రీనివాస్, కడెం మండలం అంబారిపేట్‌కు చెందిన కొప్పుల శ్రీనివాస్ నిర్మల్ నర్సింగ్ హోమ్‌లోని డాక్టర్ దామెర రాములు వద్ద కాంపౌండర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో వీరి కుమార్తెలు హితశ్రీ, రిషిక ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు సాధించారు. వీరిని రాములు దంపతులు వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

చీరెలే పంటకు రక్ష



కుంటాల: అడవి జంతువులు రోజు రాత్రి పంట చేన్లలోకి చొరబడి ధ్వంసం చేస్తున్నాయి. దీంతో మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన రైతు బోయిడి భోజన్న తను సాగు చేసిన రెండెకరాల వరి పొలాన్ని అడవి జంతువుల బారి నుంచి రక్షించుకునేందుకు పంట చుట్టూ ఇలా చీరెలను రక్షణగా ఏర్పాటు చేసుకున్నాడు.

'గిరి' గ్రామాల్లో దండారీ ఉత్సవాలు


వస్తాపూర్‌లో పాల్గొన్న ఐకేరెడ్డి


ఉత్సవాల్లో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

మామడ: మండలంలోని గిరిజన గ్రామాల్లో ఆదివారం దండారీ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివాసీలు ప్రత్యేక వేషధారణలో గుస్సాడీ నృత్యం చేస్తూ అలరించారు. వస్తాపూర్‌లో జరిగిన వేడుకల్లో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో గంగారాం పటేల్, భాస్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సారంగాపూర్: దీపావళి పండుగ నేపథ్యంలో మండలంలోని పెండల్‌దరి గ్రామంలో గిరిజనులు నిర్వహించే గుస్సాడీ, దండారీ ఉత్సవాలకు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం శ్రీహరిరావుకు గిరిజనులు తమ సంప్రదాయాలను వివరించారు. ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ, అడెల్లి ఆలయ కమిటీ చైర్మన్ భోజాగౌడ్, మధుకర్, దాసరి రమేశ్, పోతన్న, రాజేశ్వర్, ముత్యంరెడ్డి, తదితరులు ఉన్నారు.

'గోదావరి'కి తరలిన భీమన్న గదలు


గోదావరికి భీమన్న గదలను తీసుకెళ్తున్న భక్తులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలో భీమన్న ఆలయం నుంచి భీమన్న గదలను అభిషేకం చేసేందుకు ఆదివారం సమీపంలోని గోదావరికి తరలించారు. మండలకేంద్రానికి చెందిన ముదిరాజ్ సంఘం మహిళలు మంగళహారతులతో తరలివచ్చి స్వాగతం పలికారు. సోమవారం జాతర నిర్వహించనుండగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి


శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

కుంటాల: వైద్యుల సలహాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యులు జూలీ, సాయికుమార్ సూచించారు. ఆదివారం కుంటాల ఉన్నత పాఠశాల ఆవరణలో భైంసా ఆరాధన ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 120మందిని పరీక్షించి పలువురికి మందులు అందించినట్లు పేర్కొన్నారు. శిబిరంలో ఫార్మసిస్ట్ అవినాష్, అడ్మినిస్ట్రేటివ్ శ్రీనివాస్, సిబ్బంది పాషా పాల్గొన్నారు.